క్లుప్తంగా

గిట్టుబాటు కూలి దక్కేలా చర్యలు తీసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.272 కూలి అందేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కొండపి నియోజక వర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచించారు. మండలంలోని కారుమంచి గ్రామంలో గ్రామంలో ఉపాధి హామీ పనులను సోమవారం వరికూటి పరిశీలించారు. పని ముట్లు అందజేయాలని కూలీలు కోరగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పని ప్రదేశంలో మంచి నీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించే విధానాన్ని కొనసాగించాలని ఏపీఓ సుభాషిణి, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.241



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం ఆలకూరపాడు, జయవరం, పాలేటిపాడు, రావివారిపాలెం గ్రామాల రైతులు 934 బేళ్లు తీసుకురాగా 908 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.241, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.212.54 పలికింది. వేలంలో మొత్తం 28 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో 890 బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో అత్యధిక ధర కేజీ రూ.241 పలికింది. వేలం కేంద్రం పరిధిలోని అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాల రైతులు సోమవారం 927 బేళ్లు తీసుకురాగా 890 కొనుగోలయ్యాయి. అత్యల్ప ధర కేజీ రూ.153, సరాసరి ధర రూ.223.19 రైతులకు దక్కిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

తగలబడ్డ జామాయిల్‌కు గిట్టుబాబు ధర ఇప్పిస్తాం



జామాయిల్ తోటను పరిశీలిస్తున్న ఏఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం వావిలేటిపాడు పంచాయతీ పరిధిలో ఇటీవల తగలబడిన 12 ఎకరాల జామాయిల్ తోటలను సోమవారం వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సుదర్శి నరశింహారావు, ఆరేటి కొండయ్య, మిడసల నారాయణ, పాలేటి ఆదిశేష మాట్లాడుతూ.. ప్రస్తుతం జామాయిల్ టన్ను ధర రూ.3,500 ఉండగా కాలిన జామాయిల్ మాత్రం 2,500 పలుకుతోందని, న్యాయం చేయాలని ఏఓను వేడుకున్నారు. దీనిపై ఏఓ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కనిగిరి రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 13న మంగళవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ప్రతినిధి ఆర్ రూపస్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డాక్టర్ నారు రమణారెడ్డి వైద్య సేవలందిస్తారన్నారు. కనిగిరి ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముదిరాజ్ సంఘ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మృతి

● అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు



వీర్ల బ్రహ్మయ్య (ఫైల్)

కనిగిరి రూరల్: మండలంలోని కంచర్లవారిపల్లికి చెందిన ముదిరాజ్ సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు(55) వీర్ల బ్రహ్మయ్య సోమవారం ఒంగోలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అందిన సమాచారం ప్రకారం..వారం రోజుల క్రితం వి.బ్రహ్మయ్య బైక్‌పై ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైనట్లు భావించారు. బ్రహ్మయ్యకు తలకు, పలు చోట్ల బలమైన గాయాలు కావడంతో చెన్నై తదితర హాస్పిటల్స్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించినట్లు తెలిసింది. ఆదివారం ఒంగోలు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. అయితే వీర్ల బ్రహ్మయ్య ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో మృతి చెందాడా.. లేక ఏదైనా కుట్ర కోణాలు న్నాయా అనేది, పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృత దేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్యను ఉన్నత సౌకర్యాలు, వసతులతో కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నాల్గవ విడత జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం ఎంఈఓ జె.ప్రసాద్‌రావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో ఎక్కువ నిధులు విద్యా రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారన్నారు. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి విద్యకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ పాలకులు ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సర్కారు బడులకు కోట్లాది రూపాయలు వెచ్చించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. నాడు -నేడు పథకంతో ప్రవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపుదిద్దినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 458 పాఠశాలల్లో 29,737 మంది విద్యార్థులకు రూ.7,13,68,800 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. ఎంఈఓ జె.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, హెచ్‌ఎం విజయలక్ష్మి, కౌన్సిలర్లు శ్రీ రాం సతీష్, తిరుపతయ్య, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, మన్సూర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా విప్లవం మొదలైందని జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు అన్నారు. పాఠశాలల ప్రారంభం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాకానుకను జెడ్పీటీసీ చేతులమీదుగా అందజేశారు. ఎంపీటీసీ బత్తుల మాల్యాద్రి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అటేలయ్య, నాయకులు మన్నేపల్లి సురేష్, టైగర్, బోయిన మహేంద్ర, హెచ్‌ఎం ఖాదర్, నిషా బేగం పాల్గొన్నారు.

పామూరు: జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు వరం లాంటిదని ఎంఈఓ ఎస్.రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేశారు. 88 పాఠశాలలకు సంబంధించి 5548 మందికి పుస్తకాలను విద్యాకానుకగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కావిటి నాగేశ్వరరావు, రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

హనుమంతునిపాడు: పాఠశాలల ప్రారంభం రోజే జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ జి.పెద్దిరాజు మాట్లాడుతూ 65 పాఠశాలల్లో 3206 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేశామన్నారు.

వెలిగండ్ల: విద్యా సంవత్సరం ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందని సర్పంచ్ టి.సురేష్‌బాబు అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. వెలిగండ్ల(జనరల్), వెలిగండ్ల(సీపీ), గుడిపాటిపల్లి ఎయిడెడ్ పాఠశాలల్లో సర్పంచులు టి సురేష్‌బాబు, కటికల రిబ్కా వెంకటరత్నం జగనన్న విద్యాకానుక కిట్ల విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ దాసుప్రసాద్, సింగిల్ విండో చైర్మెన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ పాపా బత్తిని నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



విద్యా కానుక కిట్లను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



సీఎస్‌పురంలో కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పామూరులో విద్యాకానుక అందజేస్తున్న ఎంఈఓ రవీంద్రనాథ్



మహమ్మదాపురంలో విద్యా కానుక పంపిణీ చేస్తున్న సర్పంచ్ రత్నం



వెలిగండ్లలో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిదని ఎంఈఓ బి.శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి బ్యాగ్, టై, షూస్, నోట్ పుస్తకాలు, టెస్టు పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కొత్త రకం యూనిఫాంలు వచ్చాయని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా యూనిఫాం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిమట సుధాకరరావు, పీఈటీ ఎండీ అన్వర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య

మద్దిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య బోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సుచరిత సూచించారు. మద్దిపాడులోని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జనభాగీధారి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె తల్లులకు సూచించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పీపీ1, పీపీ2, వర్క్‌బుక్స్, ప్రీ స్కూల్ మెటీరియల్, ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుదేష్ణ, కేపీ హైమవతి, పి.కామేశ్వరి, ఎం.కెజియా, డి.ప్రభావతి, ఎంఎం గ్రేసమ్మ హాజరయ్యారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుచరిత

నర్సరాజుపాలెం మాజీ సర్పంచ్ మృతి

మద్దిపాడు: మండలంలోని నర్సరాజుపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ లగడపాటి కొండయ్య(78) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నర్సరాజుపాలెం చేరుకుని కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు ఘన నివాళులర్పించారు. మృతుడు కొండయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోద రమణారెడ్డి, మద్దిపూడి సొసైటీ అధ్యక్షులు బోగసముద్రం విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ బీసీ నాయకులు మాచేపల్లి నాగయ్య, సర్పంచ్ యాళ్ల హనుమంతరావు, లగడపాటి మాధవరావు, అలికేపల్లి కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.



కొండయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాదాసి వెంకయ్య

మైనింగ్ మాఫియా నిర్మూలనకు ప్రత్యేక బృందాలు

టంగుటూరు: మైనింగ్ మాఫియా నిర్మూలనకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మర్లపాడు, కొణిజేడు, కందులూరు గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాల నిర్మూలనకు ఎస్సై, ఎంపీడీఓ, తహసీల్దార్ నేతృత్వంలో గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఏ, సచివాలయ సిబ్బందితో 24 గంటల పాటూ కొండ ప్రాంతంతో పహరా కాసేలా చర్యలు చేపట్టామన్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తహసీల్దార్ సంజీవరావు

రేపటి నుంచి అచ్చమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాలు

పామూరు: మండలంలోని రఘునాథపురం కమ్మవారి పాలెంలోని అచ్చమాంబ దేవస్థానంలో అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు 14వ తేదీ ప్రారంభమై 18వ తేదీ ఆదివారం తో ముగుస్తాయని దేవస్థాన కమిటీ పేర్కొంది. 14వ తేదీన పసుపు కుంకుమ, సారెకావళ్లు, 15న గణపతిపూజ, కలశ స్థాపన, గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 16న మూలమంత్రం హోమాలు, అభిషేకం, సామూహిక కుంకుమార్చన, గ్రామోత్సవం, 17న పూర్ణాహుతి, కల్యాణోత్సవం, పసుపు, కుంకుమ, పెద్ద ఉత్సవం, 18న బండ్లు, పొంగళ్లు, ఉత్సవం, ఎడ్లపందేలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి

ఆర్టీసీ ఎండీకి నెల్లూరు జోన్ చైర్మన్ కృతజ్ఞతలు



ఆర్టీసీ ఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బత్తుల సుప్రజరెడ్డి

సింగరాయకొండ: ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును సోమవారం విజయవాడలో ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి దంపతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రజరెడ్డి మాట్లాడుతూ.. సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణానికి గతంలో రూ.50 లక్షలు, తాజాగా ప్లాట్‌ఫాంల ఎత్తు పెంచడానికి, మరుగుదొడ్ల నిర్మాణానికి మరో రూ.30 లక్షలు వెరసి మొత్తం రూ.80 లక్షలు మంజూరు చేశారని వివరించారు. డ్రైనేజీ నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని ఎండీని కోరగా త్వరలో టెండర్ల దశ పూర్తవుతుందని చెప్పారన్నారు. అనంతరం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని డాక్టర్ అశోక్ కుమార్‌రెడ్డి కలిశారు. తనపై జరిగిన దాడి ఘటనను వివరించి వినతిపత్రం అందజేశారు.

బియ్యం పంపిణీ

కనిగిరి రూరల్: బైక్ ప్రమాదంలో గాయపడిన రాయసం మాల్యాద్రికి బ్రహ్మణ మహాసభ సంఘ నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ మేరకు మాల్యాద్రికి 50 కేజీల బియ్యం అందచేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుల మాచవరం రమేష్, ధూళిపాళ్ల మల్లికార్జునరావు, శింగంపల్లి రాంప్రసాద్, సంగరాజు సాయి మనోజ్, మురళీ, సాధ చలపతిరావు, రవి, రాము, రాళ్లపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

కనిగిరి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం (శ్రీవాణి ట్రస్ట్) ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక 3వ వార్డులో నూతనంగా నిర్మించిన సీతా రామ లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే, టీడీపీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం, గణపతి పూజ, గ్రామోత్సవం అత్యంత వైభంగా నిర్వహించారు. దేవతామూర్తులకు జరిగిన విశిష్ట పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక కౌన్సిలర్లు పెన్నా నాగమ్మ, నక్కా ఉమా, రామనబోయిన ప్రశాంతి, దేవరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ స్వామి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్‌లు పులి కాంతి గోవర్దన్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, కౌన్సిలర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నాయకులు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను, చైర్మన్ గఫార్‌లను ఘనంగా సన్మానించారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పార్టీ శ్రేణులు

దేవదాయ భూమి ఆక్రమణకు యత్నం

● అడ్డుకున్న అధికారులు

సింగరాయకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూమి ఆక్రమణకు కొందరు అక్రమార్కులు ప్రయత్నించగా దేవదాయశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. సోమరాజుపల్లి పంచాయతీ సర్వే నంబరు 607లో 2.98 ఎకరాల వేదపారాయణం భూమి ఉంది. ఈ భూమిపై 2019 నుంచి ఆర్డీఓ కోర్టులో వ్యాజ్యం నడుస్తుండగా.. దేవస్థానానికే దక్కుతుందని ఇటీవల ఆర్డీఓ కోర్టు తీర్పు చెప్పింది. కానీ సోమవారం నంబర్ ప్లేట్ లేని జేసీబీతో ఆలయ భూమిని అక్రమార్కులు చదును చేశారు. విషయం తెలుసుకున్న వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ పి.కృష్ణవేణి సంఘటనా స్థలానికి వెళ్లి జేసీబీని అడ్డుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ సీహెచ్ ఉషకు వినతిపత్రం అందజేశారు. ఈఓ కృష్ణవేణి మాట్లాడుతూ.. దేవదాయ శాఖ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జేసీబీని అడ్డుకున్న ఈఓ కృష్ణవేణి

బాల కార్మికుల నిర్మూలన అందరి బాధ్యత

కనిగిరి రూరల్: బాల కార్మికుల నిర్మూలన అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, న్యాయవాది గఫార్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బడికి పంపించాలని కోరారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నా, పనికి పంపించినా చట్టరిత్యా శిక్షార్హులు అవుతారన్నారు. కార్యక్రమంలో మంద్రు రమేష్, వెల్ఫేర్ అధికారి మల్లికార్జున, పారాలీగల్ వలంటీర్ నవకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

నారాయణస్వామి ఆదాయం రూ.3,53,505

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రూ.3,53,505 వచ్చినట్లు ఈఓ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,21,290, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రూ. 43375, అన్నదాన విరాళాల ద్వారా రూ.145792, ఇతర విరాళాల ద్వారా రూ. 43048 వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



పెద ఇర్లపాడు శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: పీసీపల్లి మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ విశిష్ట పూజలు చేశారు. పెద ఇర్లపాడులో జరిగిన మహారుద్రాపీఠం 1111 శివలింగాల నూతన ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుర్రా ప్రత్యేక పూజలు చేశారు. రామాపురంలోని సీతారాముల స్వామి దేవస్థానంలో నూతన ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్థంభ ప్రతిష్టా మహోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో (శ్రీ వాణి ట్రస్ట్ సహకారంతో) రాష్ట్రంలో అనేక దేవాలయాల అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 25 దేవాలయాల అభివృద్ధికి, నూతన దేవాలయాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. రామాలయం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ లక్ష్మీకాంతం రెడ్డి, వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్ చౌదరి, ఒకే రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జి.బ్రహ్మారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పోలు జయరాంరెడ్డి, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా సోమవారం నందనవనం గ్రామంలో నిర్వహించిన శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ ,షుగర్,జలుబు,దగ్గు, జ్వరం,తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సలహాలు సూచలిచ్చారు. ఇంటి ముందుకే వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు షాపుల వేలంపాట

కందుకూరు: ఇటీవల వాయిదా పడిన పాతకూరగాయల మార్కెట్ ప్రాంతంలోని నూతన షాపింగ్‌మాల్ షాపుల వేలం ప్రక్రియను మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ సోమవారం తెలిపారు. షాపులకు సంబంధించి వాస్తవానికి ఈనెల 7వ తేదీనే వేలం నిర్వహించాల్సి ఉంది, కాని పరిపాలనా కారణాలరీత్యా వాయిదా వేశామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని జనరల్ కేటగిరీ కింద ఉన్న 2,3,4,5,6,7,8 షాపులకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ధరావత్తు కింద రూ.1,00,000, సాల్వెన్సీ లేదా ప్రాపర్టీ సర్టిఫికెట్ కింద రూ.2,00,000 చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిబంధనల ప్రకారం ఆసక్తి కలిగిన వారు మంగళవారం ఉదయం 11గంటలకు జరిగే బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునని కోరారు.